క్లుప్తంగా

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న సీతారాముల కల్యాణ మండపానికి సూర్యాపేటకు చెందిన మిర్యాల సుధాకర్– వజ్రమ్మ దంపతులు రూ.51,116 విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే సూర్యాపేటకు చెందిన యాదా సుజాత 100 సిమెంట్ కట్టలు, జల్లా కరుణాకర్ రూ.16,116, వనమా ప్రతీక రూ.15,000 అందజేశారు. భౌరిశెట్టి వెంకటరత్నం, వందనపు సూర్యప్రకాషరావు, గజ్జి అప్పారావు, జల్లా గణేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గ్రూప్- 4 ఫలితాల్లో కోదాడవాసికి 192వ ర్యాంక్


వస్కుల ప్రద్యుమ్న

కోదాడఅర్బన్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూప్– 4 ఫలితాల్లో కోదాడకు చెందిన వసుకుల ప్రద్యుమ్న రాష్ట్ర స్థాయిలో 192వ ర్యాంక్, సూర్యాపేట జిల్లా స్థాయిలో 6వ ర్యాంక్ సాధించాడు. ఉస్మానియా యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేసిన ప్రద్యుమ్న గ్రూప్–1 పరీక్ష ప్రిలిమ్స్‌లో రెండు సార్లు ఉత్తీర్ణుడయ్యారు. ఇటీవల పోలీస్ సెలక్షన్స్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా సూర్యాపేట జిల్లాలో ఎంపికయ్యాడు. ప్రద్యుమ్న తండ్రి కోదాడ మండల విద్యాశాఖలో మండల నోడల్ అధికారిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రద్యుమ్నను పలువురు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ డివిజన్ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘ సమావేశం శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్న వెంకటేశ్వర్లు, పి.పుల్లయ్య ఆధ్వర్యంలో డివిజన్ సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్.వెంకన్న, కార్యదర్శిగా వై.నరసింహ, కోశాధికారిగా జి.కోటేష్, సభ్యులుగా మంగయ్య, వీరబాబు, నాగుల్ మీరా, నాగులు, కాశమయ్య, సైదాలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ అందజేత


నోట్ బుక్స్ అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

మోతె : మండలంలోని బుర్కచర్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గోల్ తండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుంకరి సురేష్ ఆధ్వర్యంలో దానధర్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు శనివారం నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకన్న, సింహాద్రి, ఎస్.రాము, ఎండి మజీద్, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి రూ.2 లక్షల ఆర్థికసాయం


చెక్కు అందజేస్తున్న కాలనీవాసులు

కోదాడ : క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడికి సమీపంలో నివాసం ఉండే ప్రజలు రూ. 2 లక్షల విరాళాలు సేకరించి శనివారం అందజేశారు. వివరాలు.. కోదాడ పట్టణ పరిధిలోని 13 వార్డులో నివసించే డ్రైవర్ బోయినపల్లి సుధాకర్ క్యాన్సర్ వ్యాధి భారిన పడ్డాడు. అతను నిరుపేద కావడంతో చికిత్స కోసం డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న విశ్రాంత ఉపాధ్యాయుడు కక్కిరేణి లచ్చయ్య, కక్కిరేణి నరేషలు 13, 14 వార్డులలో తెలిసిన వ్యక్తుల నుంచి రెండు లక్షల రూపాయలను సేకరించి చెక్ రూపంలో బాధితుడికి అందజేశారు. ఆపదలో తమను ఆదుకున్న వారికి సుధాకర్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లీశ్వరి, ఈదుల కృష్ణయ్య, బొలిశెట్టి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు

మునగాల: మండలంలోని కృష్ణానగర్ గ్రామ పంచాయతీ పరిధిలో పాత కక్షలు దృష్టిలో ఉంచుకొని ఒక వర్గంపై మరో వర్గంపై దాడి చేసిన సంఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.లోకేష్ తెలిపారు. కృష్ణానగర్‌కు చెందిన గుండ్లపల్లి సైదిరెడ్డి, భార్య కాంచనపై ఇదే గ్రామానికి చెందిన కొందరు దాడి చేయడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ నెలకొన్నది. ఈ మేరకు గుండ్లపల్లి కాంచన ఇచ్చిన ఫిర్యాదుతో గ్రామానికి చెందిన వీరంరెడ్డి సీతరావమ్మ, వీరంరెడ్డి లక్ష్మారెడ్డి, వీరంరెడ్డి వెంకటరెడ్డి, బేతం కాంత్‌రెడ్డి, బేతం వెంకటరెడ్డి, రాజమోహన్‌రెడ్డి, బేతం వెంకటరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బేతం తులిశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుండ్లపల్లి సైదిరెడ్డి, కాంచన, వెంకమ్మలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐతెలిపారు.

అభాగ్యురాలిని ఆదుకోండి..

- గుండెకు రంధ్రం ఏర్పడడంతో ఆపరేషన్ చేసిన వైద్యులు
- సక్సెస్ కాకపోవడంతో మరోసారి చేయాల్సిన అత్యవసర పరిస్థితి
- రూ.10 లక్షల ఖర్చవుతుందని వైద్యుల వెల్లడి
- ఆర్థికసాయం కోసం ఎదురుచూపు


బాధితురాలు పి. వాసంతి

కోదాడ: చిన్ననాటి నుంచే గుండెకు రంధ్రం ఉంది. కట్టుకున్న వాడు అప్పోసప్పో చేసి ఆపరేషన్ చేయించినా అది సక్సెస్ కాలేదు. ఇంతలోనే పుట్టిన పాప పుట్టిడు దుఖాన్ని మిగిల్చి వెళ్లింది. దీంతో ఆ అభాగ్యురాలి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. పరీక్షించిన వైద్యులు గుండెలో కండ పెరిగిందని.. వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పడంతో ఆ నిరుపేద కుటుంబానికి దిక్కుతోచడం లేదు. భర్త ప్రైవేట్ ఉద్యోగి కావడంతో వైద్యం చేయించే స్థోమత లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు.

పుట్టకతోనే ఇబ్బంది..

కోదాడలోని శ్రీనివాసనగర్‌కు చెందిన వాసంతికి పుట్టుకతోనే గుండెలో రంధ్రం ఉంది. చిన్నప్పుడు పెద్ద సమస్య ఏదీ రాలేదు. వివాహం జరిగిన తరువాత ఆరోగ్యం ఇబ్బందిగా మారడంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లి పరీక్షించగా గుండెకు రంధ్రం ఉందని వైద్యులు చెప్పడంతో దాదాపు రూ.5లక్షలు ఖర్చు చేసి ఆపరేషన్ చేయించారు. ఆరోగ్యం కుదుటపడి ఆమె పాపకు జన్మనిచ్చింది. కొద్దిరోజుల్లోనే ఆ చిన్నారి అనారోగ్యంతో మృతి చెందడంతో వాసంతి ఆరోగ్యం మరోసారి క్షీణించింది. వైద్యుల వద్దకు తీసుకెళ్లగా గతంలో గుండెకు జరిగిన ఆపరేషన్ సక్సెస్ కాలేదని, గుండెలో కండ పెరిగిందని వెంటనే మరోసారి ఆపరేషన్ చేయాలని, లేకపోతే ప్రాణాలకే ప్రమాదమని చెప్పడంతో ఆ కుటుంబానికి దిక్కుతోచడం లేదు. ఆపరేషన్‌కు రూ.10 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో కుటుంబసభ్యులు దాతల సాయం కోసం వేడుకుంటున్నారు.

> సాయం చేయాలనుకున్న వారు
> పి. వాసంతి, బ్యాంక్ అకౌంట్ నంబర్ : 395314 45653, ఎస్‌బీఐ, కోదాడ
> ఐఎఫ్‌సీకోడ్ : ఎస్‌బీఐ 0020181
> ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్: 75692 85191

క్లబ్ సభ్యులు సామాజిక సేవ చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు


ప్రమాణస్వీకారం చేస్తున్న కోదాడ పబ్లిక్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, పాల్గొన్న చందర్‌రావు

కోదాడఅర్బన్ : కోదాడ పబ్లిక్ క్లబ్ కార్యవర్గ సభ్యులు సామాజిక సేవ చేయాలని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు కోరారు. శనివారం కోదాడలోని కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆయన సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాయం పట్టాభిరెడ్డి, కార్యదర్శిగా బొల్ల రాంబాబు, ఉపాధ్యక్షుడిగా వేనేపల్లి సత్యనారాయణ, జాయింట్ కార్యదర్శిగా చింతలపాటి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులుగా పలుపులేటి నాగేశ్వరరావు, ఓరుగంటి రవి, పాశం నాగిరెడ్డి, గుండపనేటి వేణుగోపాల్‌రావు, కారుమంచి సత్యనారాయణ, బి.రాబిన్, వంశీకృష్ణను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, అడ్వకేట్ ఎస్.రాధాకృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మాజీ సర్పంచ్ పారా సీతయ్య, వంగవీటి రామారావు, రావెళ్ల సీతారామయ్య, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలికల అప్పగింత

మునగాల(కోదాడ): మండల కేంద్రంలోని ఓ పాఠశాల నుంచి గురువారం అదృశ్యమైన ఇద్దరు బాలికల ఆచూకీని శనివారం పోలీసులు కనుగొన్నారు. మునగాల మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో 9,10వ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు ఇంటినుంచి బయలుదేరి పాఠశాలకు చేరుకోలేదు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలికల తల్లిదండ్రులకు ఫోన్ ద్వార సమాచారం ఇచ్చారు. దీంతో వారు పలు చోట్ల వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో శుక్రవారం ఉదయం మునగాల పోలీసుస్టేషన్‌లో బాలికలు అదృశ్యమైనట్లు ఫిర్యాదు ఇచ్చారు. దీంతో మునగాల పోలీసులు వెంటనే స్పందించి కేసు దర్యాప్తు చేపట్టారు. టెక్నాలజీను ఉపయోగించి బాలికలు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లు ఎస్ఐ లోకేష్ గుర్తించారు. అనంతరం ఇద్దరు బాలికలను కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు.

ఘంటసాల పాటల పోటీలు


పాట పాడుతున్న విద్యార్థి

భానుపురి (సూర్యాపేట) : ఘంటసాల 50 వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీజ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళావేదిక అధ్యక్ష, కార్యదర్శులు జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, గుండా రమేష్ మాట్లాడారు. ఘంటసాల తన అద్భుత గానంతో తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.రాజా బాబు, భద్రాద్రి కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ కేవీఎస్ కుమార్, ఉపాధ్యాయుడు కల్లూరు నాగయ్య, సుధా బ్యాంకు ఎండీ పెద్దిరెడ్డి గణేష్, జిల్లా బాలభవన్ పర్యవేక్షకురాలు బి.రాధాకృష్ణారెడ్డి, వేదిక ఉపాధ్యక్షులు నక్క శ్రీనివాస్, దాసరి సత్యం, కార్యనిర్వాహక సహాయకులు బచ్చు పురుషోత్తం, విశ్రాంత ఉపాధ్యాయులు హమీద్ ఖాన్ పాల్గొన్నారు.

రోడ్డుపై గుంత పూడ్చాలి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని రాంపురంలో నేరేడుచర్ల– పెంచికల్‌దిన్న ప్రధాన రోడ్డుపై డ్రెయినేజీ నిర్మాణం కోసం తవ్విన గుంతను వెంటనే పూడ్చాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గుంతను పరిశీలించి మాట్లాడారు. కాంట్రాక్టర్ గుంతలు తీసి వదిలివేయడంతో ఇటీవల ఓ వ్యక్తి గుంతలో పడి గాయాలపాలయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదాలు జరగక ముందే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి గుంతలను పూడ్చాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కోణతం నాగిరెడ్డి, రాజేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాగయ్య, సైదులు, సైదిరెడ్డి, సురేష్, రఘునాథరెడ్డి ఉన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి


హుజూర్‌నగర్ : సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : ఈనెల 16న నిర్వహించే దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోషణబోయిన హుస్సేన్ కోరారు. శనివారం హుజూర్‌నగర్ మండలంలోని కరక్కాయలగూడెంలో పంచాయతీ కార్యదర్శి సతీష్‌కు సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చింతకుంట్ల వీరయ్య, జీపీ సిబ్బంది నాగరాజు, పుల్లయ్య, సత్యనారాయణ, నాగేశ్వరరావు, పుల్లయ్య, రమణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్‌బంద్ పోస్టర్ ఆవిష్కరణ

కోదాడఅర్బన్ : ఈ నెల 16న నిర్వహించబోయే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నర్సింహారావు పిలుపునిచ్చారు. శనివారం కోదాడలోని లాల్‌బంగ్లా వద్ద బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్న దుర్మార్గమైన పాలనకు నిరసనగా నిర్వహిస్తున్న ఈ సమ్మెలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, మైసయ్య, కొండలు, రామారావు, నాగేష్, సైదులు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు యాజమాన్యాలు సహకరించాలి

హుజూర్‌నగర్ : దేశవ్యాప్త సమ్మెకు మిల్లుల యాజమాన్యాలు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైస్ మిల్లుల యాజమాన్యలకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఇందిరాల వెంకటేశ్వర్లు పానుగోతు గోపి, నక్క వెంకటేశ్వర్లు, ధారా వీరస్వామి, లింగం ధనమూర్తి, రామిశెట్టి శ్రీను, ఈశ్వరాచారి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌టీయూసీ ఆధ్వర్యంలో..

దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని టీఎస్‌టీయూసీ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లో రైస్ మిల్లర్లకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి, నాయకులు జి.వెంకన్న మామిడి వీరబాబు, చల్లా వంశీ, నాగరాజు రమేష్ రామయ్య లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగానికి అరకొర నిధుల కేటాయింపు సరికాదు

కోదాడఅర్బన్ : విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అరకొర కేటాయించడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు అన్నారు. శనివారం కోదాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా రంగానికి ప్రభుత్వం రూ. 22,389 కోట్లు మాత్రమే కేటాయించిందని, మొత్తం రూ. 2,75,891 కోట్ల బడ్జెట్‌లో ఇది కేవలం 8.11 శాతం నిధులు మాత్రమేనని తెలిపారు. బడ్జెట్‌ను చూస్తే సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. రాష్ట్రంలో దాదాపు రూ.6500 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు కనీస సదుపాయాలు లేక కూనారిల్లుతున్నాయని అన్నారు. విద్యారంగం బాగుపడాలంటే ఈ నిధులు సరిపోవని, బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని అన్నారు. బడ్జెట్‌పై నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఆందోళనలు చేయాలని పీడీఎస్‌యూ పిలుపునిస్తున్నదని తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


గుండ్లపహాడ్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ భూక్యా గోపాల్

పాలకవీడు : మండలంలోని గుండ్లపహాడ్ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ భూక్యా గోపాల్ ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మంజూరైన రూ.5 లక్షల నిధులతో గ్రామంలో సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మండలంలోని ప్రతీ గ్రామపంచాయతీకి రూ.1.90 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాళోతు బుజ్జి మోతీలాల్ నాయకులు మహ్మద్ వాజిద్, వీరనారాయణ, మట్టయ్య, వీరబాబు, కోటేశ్వరరావు, ఇస్మాయిల్, నాగయ్య, అనిల్, చోటి, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

చాకిరాలలో 45 పందులు చోరీ

నడిగూడెం : గుర్తుతెలియని వ్యక్తులు 45 పందులను చోరీ చేశారు. నడిగూడెం మండలం చాకిరాలలో శనివారం వెలుగుచూసిన ఈ ఘటనపై బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వరికుప్పల కళింగరావు పందులను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3న తన షెడ్‌లలో ఉన్న పందులను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితుడు తెలిపాడు. వాటి విలువ దాదాపు ఐదు లక్షల రూపాయలు ఉంటుందని తెలిపాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జగన్ తెలిపారు.

పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గరిడేపల్లి : విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని నేరేడుచర్ల లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, జిలకర రామస్వామి అన్నారు. శనివారం గరిడేపల్లి మండలంలోని వెలిదండ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్, వెలిదండ పూర్వ విద్యార్థులు శౌరి, మిత్రుల సహకారంతో ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్ ప్రారంభించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, స్టేషనరీ సామగ్రిని అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.కనకయ్య, రాయిరాల శౌరి, సీపీరావు, బుచ్చారావు, కేవీ సత్యనారాయణ, కళావతి, సువర్ణ, లక్ష్మయ్య, నాగయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూరగాయల దినోత్సవం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో శనివారం కూరగాయల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కూరగాయలు, ఆకుకూరల ప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుస్సా సులోచన, ఉపాధ్యాయులు రమ్య, రజియా, లక్ష్మి, వైదేహి, హనీఫా, మల్లిక, ఉష, వీరయ్య, సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం అందజేత


బియ్యం అందజేస్తున్న వాసంతి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని వృద్ధాశ్రమానికి తెలంగాణ ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షురాలు కందిబండ వాసంతి– హరిప్రసాద్ అల్లుడు రాచర్ల సతీష్ పుట్టినరోజు సందర్భంగా బియ్యం, పండ్లు, కూరగాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాచకొండ శ్రీనివాస్‌రావు, గరిణె అరుణకుమారి, పాల్వాయి రమేష్, రాధిక, నటరాజ్, కోటేశ్వర్‌రావు, భాగ్యలక్ష్మి, విజయ, సావిత్రమ్మ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌ఓ కోటాచలం


సర్వారం గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓ కోటాచలం సూచించారు. గరిడేపల్లి మండలంలోని కల్మలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సర్వారం గ్రామంలో గత కొన్ని రోజులుగా ప్రజలు జ్వరాల భారిన పడుతుండడంతో శనివారం గ్రామంలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌ను డీఎంహెచ్‌ఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటివరకు 74 మందికి రక్త పరీక్షలు నిర్వహించగా 17 మందికి డెంగ్యూ నిర్ధారణ అయిందని తెలిపారు. తాగునీటి పైప్‌లైన్లు డ్రెయినేజీలలో ఉండడడంతో నీరు కలుషితమై, అదే విధంగా మురుగు నీరు నిలువ ఉండి దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. ఇంటింటికి తిరిగి పరిసరాల పరిశుభ్రత, వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో జ్వరాలు తగ్గే వరకు మెడికల్ క్యాంపు కొనసాగించాలని వైద్యాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ శృతి, మాస్ మీడియా అధికారి అంజయ్య గౌడ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరాజు, హెచ్ఈఓ రామకృష్ణ, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, ఏఎన్ఎం అనిత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని ప్రాంతీయ వైద్యశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించేందుకు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు, శానిటేషన్ డ్రైవ్, డ్రైడే, దోమల నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా మాస్ మీడియా అధికారి అంజయ్య గౌడ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, హెచ్ఏ ఇందిరాల రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రం పరిశీలన

చిలుకూరు : సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. శనివారం చిలుకూరు మండల పరిధిలోని నారాయణపురం ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఫీవర్ సర్వేలు చేస్తూ మందులు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నవ్య, అంజయ్య, సీహెచ్‌ఓ వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యవహారశైలితో రైతులకు నష్టం

- మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, క్రాంతికిరణ్


చలో నల్లగొండ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, క్రాంతికిరణ్, నాయకులు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారశైలి రైతులకు నష్టం కలిగించే విధంగా ఉందని మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. శనివారం హుజూర్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించి ఉమ్మడి జిల్లా రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రాజెక్టులను సాధించుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో కలిసి పార్టీ నాయకులు, సాగర్ ఆయకట్టు రైతాంగం పోరాడాలని కోరారు. రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తున్నదని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 13న పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన నల్లగొండలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. అనంతరం చలో నల్లగొండ పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు కొప్పుల సైదిరెడ్డి, ఎస్.బసవయ్య, కృష్ణ, సురేష్, అమర్, అప్పిరెడ్డి, రంగాచారి, కె.వెంకటరెడ్డి, జె.నాగేశ్వరరావు, జె.వీరయ్య, నగేష్ రాథోడ్, వెంకటేశ్వర్లు, కొండా నాయక్, పి.ఉపేందర్, పిచ్చయ్య, జయబాబు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న కాంగ్రెస్

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్


చలో నల్లగొండ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోదాడ : కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్ట్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అప్పజెప్పి రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తుందని, దీనికి నిరసనగా ఈ నెల 13న నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే నిరసన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. శనివారం కోదాడ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు చలో నల్లగొండ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక బీఆర్ఎస్‌పై అనవసరపు రాద్ధాంతం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో తొగరు రమేష్, బెజవాడ శ్రావణ్, పచ్చిపాల వేణుయాదవ్, సైదులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ, లయన్స్ క్లబ్ సభ్యులు

పాలకవీడు : పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ భూక్యా గోపాల్ విద్యార్థులకు సూచించారు. శనివారం పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలోని జిల్ల పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు దాతల సహకారంలో అల్పాహారం ఏర్పాటు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేసి మాట్లాడారు. కాగా, జాన్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో అల్పాహారానికి జెడ్పీటీసీ మాళోతు బజ్జి మోతీలాల్ రూ.5 వేలు, ఎంపీపీ గోపాల్ రూ.5 వేలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుబ్బారావు రూ.5 వేలు అందజేశారు. బొత్తలపాలెం, పాలకవీడు ఉన్నత పాఠశాలలకు పాలిశెట్టి వెంకటేశ్వర్లు రూ.6 వేలు, యాదా ఈశ్వరయ్య రూ.6 వేలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ బట్టు మధు, సుంకరి క్రాంతికుమార్, జిలకర రామస్వామి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ)లో పని చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాల బోధన అనుభవంతో పాటు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్, మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో కనీసం 50శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. అర్హత గల వారిని రెండు సంవత్సరాలు డిప్యూటేషన్ ప్రాతిపదికన పని చేసేందుకు హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లు సంబంధిత వెబ్‌సైట్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీలో 13 రకాల సబ్జెక్టుల్లో 28 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. సైకాలజీ, ఫిలాసఫీ, సోషియాలజీ, హిందీ, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఒక్కో పోస్టు, ఉర్దూకు రెండు పోస్టులు, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, గణితం, సోషల్ స్టడీస్, తెలుగు, ఇంగ్లీష్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీలలో మూడు పోస్టుల చొప్పున డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను తీసుకోనున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ 2024 నాటికి 58 సంవత్సరాలు పూర్తికాని వారు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు యూజీసీ గ్రాంట్స్ కమిషన్ నుంచి గుర్తింపు పొందిన పోస్ట్ గ్రాడ్యుయేషన్, మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఎంఈడీ) పూర్తి చేసిన విద్యార్హత గల సర్టిఫికెట్లు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అధికారులకు సూచించారు. శనివారం హుజూర్‌నగర్ మండలంలోని అమరవరంలో ఎంపీడీఓ, గ్రామ ప్రత్యేక అధికారి లావణ్యతో కలిసి బోరు వేయించారు. అనంతరం గ్రామంలో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు, కార్యదర్శి కవిత, గ్రామ పెద్దలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం తహసీల్దార్ నాగార్జునరెడ్డి, కౌన్సిలర్ కస్తాల శ్రవణ్ పంపిణీ చేశారు. 11వ వార్డుకు చెందిన మీసాల ఉషారాణి, ఆలూరి విజయ లక్ష్మిలకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

మహాసౌర యాగం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాయలంలో మహాసౌర యాగం పూజలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నెల రోజులు సూర్య నమస్కారములు, హోమాలు, గోత్రనామాలు, అర్చన, మంచామృతాభిషేకాలు, పంచాయతన హోమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొంకపాక రాధాకృష్ణమూర్తి, యాతవాకిళ్ల భానుకిరణ్‌శర్మ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గరిడేపల్లి : బీజేపీ ప్రభుత్వ మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్ర చేస్తుందని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ ఆరోపించారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలో హమాలీ సంఘం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పిట్ట సోమయ్య, అనంత వెంకటేశ్వర్లు, నాగరాజు, ముత్యాలు, శ్రీనివాస్, జలందర్ తదితరులు పాల్గొన్నారు.